కథానిక

# గాజు భరిణె

## బలభద్రపాత్రుని రమణి

రామారావుగారిల్లు చాలా హడావిడిగా వుంది. పెళ్లి కళ వుట్టిపడ్తోంది.

'అత్తయ్యా!బుగ్గన చుక్క పెడ్తాను వుండండి 'అంటూ వచ్చిన చిన్న కోడలు శాంతతో సిగ్గుగా 'అబ్బా! ఏవిటంత ఆర్భాటం? 'అంది జానకి.

ఎప్పుడో ముప్పై ఏళ్ల క్రితం జరిగిన మీ పెళ్లికి మేమంతా లేము కదా మరి!ఇప్పుడు చూడనీయండి 'అని శాంత అంటే మిగతా వాళ్లంతా నవ్వేసారు.

కొడుకులూ, కోడళ్లూ, కూతురూ, అల్లుడూ వచ్చిన వాళ్లకి మర్యాదలు చెయ్యడంలో, ఎదురేగి స్వాగతం చెప్పడంలో చాలా బిజీగా వున్నారు.

'వదినా...రా అన్నయ్య పిలుస్తున్నాడు' అంటూ వచ్చింది ఆడబిడ్డ ప్రభావతి.

జానకికి లేస్తూవుంటే వళ్లు తూలింది. అసలే పట్టుచీర బరువొకటి. మెడలోని కాసుల పేరూ, నెక్లెసూ సరిగ్గా సర్దింది పెద్ద కోడలు.

జానకిని తీసుకెళ్లి రామారావుగారి ప్రక్కన కూర్చో బెట్టారు. ఆమె భర్త వైపు క్రీగంట చూసింది. ఆయన ముఖంలో అంతులేని సంతృప్తి నాట్యమాడ్తోంది. ఇద్దరు కొడుకులూ డాక్టర్లై మంచి ప్రాక్టీసు చేస్తు న్నారు. కూతురికి ఇంజనీర్ని తెచ్చి ఘనంగా పెళ్లి చేసారు. స్వంత ఇల్లూ, ఆస్తిపాస్తులూ, ఉద్యోగం తెచ్చి పెట్టిన హోదా ఆయన ముఖంలో ఆ తృప్తిని తెచ్చి పెట్టాయి.

'జానకి వేణుగోపాలావుగారొస్తున్నారు...అదిగో ఆ వెనకాల వస్తున్నది ఎవరో తెలుసా? రాజారావు హైకోర్టు జడ్జీ....నా చిన్ననాటి స్నేహితుడు. వెంక టాచలం కూడా వస్తున్నాడు. ఎంత మినిస్టరైనా నాకు ఆప్త మిత్రుడు కదా!'రామారావు గొంతులో గర్వం ఆమె గమనించింది.

రామారావుగారి షష్టిపూర్తి ఆయనకి నలభై ఏళ్ల క్రిందట జరిగిన పెళ్లికన్నా ఆర్భాటంగా జరుగు తోంది.

జానకి వచ్చిన వాళ్లందర్నీ పరికించి చూసింది. కోడళ్ల వుట్టింటి వాళ్లూ, తన వుట్టింటివారూ, అత్తవారింటి తరవు వాళ్లూ, రామారావుగారి మిత్రులూ, శ్రేయోభిలాషులూ....అందరూ వచ్చారు. కానీ ఆమెకి కావల్సిన ఒక్కరు తప్ప! ఆమె కళ్లు మాటి మాటికీ గుమ్మం వైపు ఆశగా చూస్తునే వున్నాయి.

ఎవరో పెద్దపెద్ద గులాబీపూల మాలలు అల్లించి తెచ్చారు. దంపతుల్ని మార్చుకోమన్నారు. రామా రావుగారికి జానకి దండ వెయ్యబోతే ఆయన అందలేదు.

'ఈ ఒక్క రోజన్నా వదినకి అందరా అన్నయ్యా! ప్రభావతి హాస్యమాడింది.

ఆయన నవ్వాడు కానీ వంగలేదు.

జానకే లేచి ఆయన మెడలో దండ వేసింది. ఆమె మనసులో అనుకుంది. 'ఆయన వంగడు! ముప్పైనాలుగేళ్ల వైవాహిక జీవితంలో ఆయన ఎప్పుడూ తన మాటే నెగ్గించుకుంటూ వచ్చాడు. ఒక్కనాడూ ' ఇది నీకు ఇష్టమేనా? అని కానీ ఇది నీకు కావాలా? అని కానీ అడగలేదు.

తల్లికి ఇష్టం అని కరకజ్జం తీసుకొచ్చి ఇచ్చే వాడు. శలవులకి వచ్చిన చెల్లెలికి ప్రతిరోజూ కొబ్బరి బొండాలు ఇష్టం అని పూతరేకులూ తెచ్చి పెట్టే వాడికి, కొత్త పెళ్లాంకి మల్లెపూలు ఇష్టం అని తెలీదుట! ఏనాడూ తీసుకురాలేదు. అభిమానం వల్ల జానకే నోరు మెదిపేది కాదు. ఆయన తీసుకొచ్చి చేతిలో పెట్టింది తీసుకోవడం తప్ప ఏదీ కావాలని కోరలేదు. ఆయనకి పెట్టికానీ ఏదీ నోట్లో వేసుకోలేదు. ' నువ్వు తిన్నావా? అని ఆయన ఎప్పుడూ అడగలేదు.

పిల్లలు పుట్టారు, పెద్దాళ్లయ్యారు. ఆడబిడ్డల పెళ్లిళ్లూ, పిల్లల పెళ్లిళ్లూ అన్నీ సక్రమంగా జరిగి షష్టిపూర్తిలో పడ్డారు. ఈ నాడు ఆయన ఒంగుతా డని ఆశించడం ఏవిటీ తన పిచ్చి కానీ...అనుకుంది.

భోజనాల కార్యక్రమం కూడా మొదలయింది. జానకి ఆశ పూర్తిగా చచ్చిపోయే సమయంలో... ఆమె కనపడింది. జానకి కళ్లు మతాబాల్లా వెలిగాయి.

'కృష్ణవేణీ...కృష్ణవేణండీ!' అంది ఆనందంగా భర్తతో.

నేత చీర కట్టుకుని,వేలిముడి వేసుకుని, చేతి సంచీతో ఓ స్త్రీ లోపలికి వస్తూ కనబడింది.

జానకి ఆత్రుతగా లేచి నిలబడబోయింది. మెడ లోని దండ బరువు ఆమెని ముందుకి అంత తేలిగ్గా వెళ్లనియ్యలేదు. కుటుంబ బరువు బాధ్య తలు ఇన్నాళ్లనుండీ ఆపితే ఆగినట్లే, ఈసారి ఆమె తన మెడలోని దండని మోసుకుంటూ ముందుకి వెళ్లలేకపోయింది.

'జానకీ!' కళ్లనిండా నీళ్లతో పిలుస్తూ ముందుకి వచ్చింది కృష్ణవేణి.

'కృష్ణా!' జానకి ఆమెని ఆప్యాయంగా కౌగిలిం చుకుంది. 'ఇప్పుడా రావడం? నీ కోసం ఎంతగా ఎదురుచూసానో తెలుసా? 'అంది.

కృష్ణవేణి కళ్లు తుడుచుకుని ' అబ్బాయి, కోడలూ ఆఫీసులకి వెళ్లిపోతారు...పిల్లలకి ఇబ్బంది అని వాళ్లొచ్చేవరకూ కూర్చుని ఇప్పుడు బయల్దేరి వచ్చాను. ఎంత చిక్కిపోయావే జానీ!'అంది.

జానకి కృష్ణవేణి చెయ్యి అందుకుంది. ఈ హడా విడికి దూరంగా ఎక్కడికైనా పారిపోవాలనిపిస్తోంది. ఎప్పటి స్నేహం...

పట్టులంగా కుచ్చెళ్లు పైకి పట్టుకుని కోనేట్లో కాళ్లు కడుక్కోవడం, బొమ్మలకి చీరలు కట్టి బొమ్మల పెళ్లిళ్లు చెయ్యడం, ఆపైన ఓణీలే సుకునే వయసొచ్చాక కాబోయే వాడి గురించి సంయుక్తంగా కలలు కనడం! ఎన్నెన్ని కబుర్లు ...ఎంతెంతసేపు చెప్పుకున్నా, తనివి తీరక ఒకర్ని వదిలి ఒకరు వెళ్లలేక పెద్దాళ్లచేత తిట్లు తినడం... అన్నీ గుర్తుకొస్తున్నాయి.

అటువంటి మధురానుభూతులూ, ఆనందాలూ కడిగేసిన కాలం...ఇప్పుడెన్ని అలంకారాలు చేస్తే మాత్రం ఏం లాభం?

'కృష్ణా పద భోంచేద్దువుగాని...నేను దగ్గరుండి పెడ్తాను.' అని స్నేహితురాలితో అంటూ వుండగానే

> “ బొమ్మలకి చీరలు కట్టి, బొమ్మల పెళ్ళిళ్ళు చెయ్యడం, ఓణీ వేసుకున్నాక కాబోయే వాడి గురించి కలలు కనడం ఎన్నెన్ని. ఎన్నెన్ని వలపులు... తలపులు ”

‘జానకీ...వాళ్లొచేసారు..మినిష్టర్‌గారు..అదే మా వెంకటాచలం!’అని రామారావు తెగ హడావుడి పడిపోతూ వచ్చి జానకి చెయ్యి పట్టి లాగి తీసుకెళ్లిపోయారు.

జానకి కృష్ణవేణిని విడవలేక విడవలేక విడిచి భర్త వెంట వెళ్లింది.

‘రండి...భోంచేద్దురుగాని ’ అంది జానకి పెద్ద కోడలు కృష్ణవేణితో.

కృష్ణవేణి ఆమె వెంట నడిచింది.

మినిష్టర్‌గారి భార్య జానకిని చూసి హుందాగా నవ్వింది. జానకి నమస్కరించింది.

‘రండి..రండి..భోజనాలకి వేళమించిపోయింది అన్నాడు రామారావు.

అందరూ డైనింగ్ టేబుల్స్ వైపు నడిచారు.

> “ అతను గాజు భరిణె విలువను తెల్సుకోలేక పోయాడా? ఆమె సున్నితమైన మనసు విలువను తెలుసుకోలేక పోయాడా? ”

కృష్ణవేణికి ఈ బఫేలు అలవాటు లేదు. ఏం తింటుందో ఏవిటో!అని జానకి ప్రాణం పీగులాడింది.

ఆనాడు కృష్ణవేణి పెళ్లయి. అత్తారింటికి వెళ్లిపోతూవుంటే తన ప్రాణం తననించి వేరయిపోతున్నట్టుగా విలవిలలాడింది జానకి.

‘పెళ్లయితే స్నేహం మానేస్తామా ఏవిటి? ఉత్తరాలు లేవూ!’అని ఓదార్చింది కృష్ణవేణి.

అన్నమాట ప్రకారం క్రమం తప్పకుండా ఉత్తరాలు వ్రాసేది. కానీ తన పెళ్లయ్యాక తనే మాటమీద నిలబడలేకపోయింది. అత్తవారింట్లో ఆచారాలూ, ఆర్భాటాల మధ్య ఊపిరి తీసుకునే వ్యవధి కూడా





## అంత పెద్దముద్దుసీనా!

రాజా హిందుస్థానీలో పెదాలతో పెదాలు కలిపి అతి సుదీర్ఘంగా అమీర్‌ఖాన్‌ని ముద్దాడింది కరిష్మాకపూర్. బయట మాత్రం పత్తిత్తుకబుర్లు చెబుతుంది ఈ పడతి. కుటుంబం, సంస్కృతి, స్త్రీయొక్క ఔన్నత్యం వంటి మాటలు చిలకలా వల్లిస్తుంది. ఏం తల్లీ మరి ఆసీనులోఅలా నటించి పారేసినప్పుడు ఇవేవి గుర్తురాలేదా అంటే? అబ్బో అప్పుడున్న మూడ్ వేరేలెండి. వర్క్ మూడ్‌లో ఇవన్నీ పట్టించుకోను.

లేక ఉత్తరాలు వ్రాయడం మానుకుంది. ఈ ముప్పై ఏళ్లలో ఓ అరడజను సార్లు కలుసుకునుంటారు. చివరిసారిగా కృష్ణవేణి భర్త పోయినప్పుడు చూడడానికి వెళ్లింది. తన ఆప్త మిత్రురాల్ని, చిన్ననాటి నేస్తాన్ని అలా చూడలేక, చూసి అలా అంత త్వరగా ఒకత్తనూ వదిలి వచ్చెయ్యలేక నరకం అనుభవించింది. కానీ రామారావు ఆ పూటే తీసుకొచ్చేసాడు. కొడుకు దగ్గరికి వచ్చేస్తున్నాననీ తన వూరు వస్తున్నందుకు సంతోషంగా వుందనీ కృష్ణవేణి వ్రాసిన ఉత్తరానికి కూడా తను జవాబు ఇవ్వలేకపోయింది. షష్టిపూర్తి కార్డు మాత్రం పంపగలిగింది.

జానకి ఎలాగో వ్యవధి చేసుకుని కృష్ణవేణి వైపు వెళ్లింది.

అప్పటికే కృష్ణవేణి చెయ్యి కడిగేసుకుంది. బి.పి మూలాన ఏమీ తినకూడదుట.

'జానకీ..ఓ సారి ఇలారా !'అంటూ ఓ మూలకి తీసుకెళ్లింది.

'నీ కోసం ఏమీ తేలేకపోయాను...'చాలా సిగ్గు పడ్తూ అంది.

'ఏం మాటలే అవి? నువ్వు రావడమే నాకు చాలా సంతోషం' మనస్ఫూర్తిగా అంది జానకి.

'కానీ...నీకిష్టమైన వస్తువు ఒకటి నా దగ్గర వుండి పోయింది...తీసుకో! సంచీలోంచి తీస్తూ అంది కృష్ణవేణి.

ఆ వస్తువుని చూడగానే జానకి కళ్లు మెరిసాయి...'కృష్ణా...ఇది ఇంకా నీ దగ్గర వుందా? ఆనందంగా అరిచింది.

కృష్ణవేణి తన చేతిలోని గాజు భరిణని చూస్తు నవ్వింది.'దీనికోసమేగా నాతో మాట్లాడడం మానేసి అలిగావు! ఎన్నోసార్లు పోట్లాడావు!'అంది.

జానకి కళ్లల్లో కొండాలమ్మ జాతరలో వాళ్లిద్దరూ ఆ గాజు భరిణని కొని, దాన్ని బొమ్మల కొలువులో పెట్టి 'నాదంటే నాదని 'పోట్లాడు 'కోవడం మెదిలింది! ఎన్నిసార్లు అడిగినా కృష్ణవేణి ఇచ్చిందికాదు!

జానకి దాన్ని అపురూపంగా అందుకుంది.

'వస్తానే..ఆలస్యం అయితే పిల్లలు ఇబ్బంది పడ్తారు. బ్రతికుంటే మళ్లీ తీరుబడిగా వస్తా!'వణుకుతున్న గొంతుతో అంది కృష్ణవేణి.

జానకి ఠక్కున ఆమె నోటిని తన చేత్తో మూసింది..'అవేం మాటలే? అప్పడే వెళ్లిపోతావా....అసలు కళ్లారా చూసుకున్నట్టుగా కూడా లేదు!'అంది.

'పిల్లలకి స్వీట్లు ప్యాక్ చేసి ఇస్తాను'అని జానకి అంటూ వుండగానే

రామారావుగారు 'వెంకటాచలంగారు వెళ్లిపోతారట...అని చేయి పట్టి లాక్కెళ్లిపోయారు. ఓ పక్క ఆప్తమిత్రుడు అంటూనే మళ్లీ ఈ రాచ మర్యాదలెందుకో!అనుకుంది జానకి. 'కృష్ణ..ఇచ్చిందండీ! భర్తకి భరిణని చూపించింది.

వెండి పళ్లెంలో పట్టువస్త్రాలని పెట్టి రామారావు జానకిలకి బహుకరించారు మినిష్టర్‌గారు.

జానకి చేతిలో భరిణ పక్కనే స్టూల్‌మీద పెట్టి వాటిని అందుకుంది.

'అన్నయ్యా! ఆడబిడ్డ లాంఛనాలు ఏమిస్తావు?' ప్రభావతి అడిగింది.

రామారావుగారు వెంటనే కుడిచేతి వేలినుండి బంగారు ఉంగరం తీసి ఇచ్చేసారు.'ఎలాగైనా మా అన్నయ్య తీరే వేరు' ఆమె అన్నయ్యని మెచ్చుకుంది.

'జానకిని పర్మిషన్ అడిగావుట్రా?' ఎవరో ముసలావిడ హాస్యమాడింది.

నామాటే తన మాట! ఇన్ని సంవత్సరాలలో నాకు తనని అడిగి ఇవ్వాల్సిన అవసరం ఏ విషయంలో రాలేదు!ధీమాగా చెప్పాడు రామారావు.

జానకి ఈ పెట్టుపోతలూ, హంగామాలూ పట్టించుకునే స్థితిలో లేదు. ఆమె కళ్లన్నీ వెళ్లిపోతున్న కృష్ణవేణి మీదే వున్నాయి. పెద్దకోడలికైనా చెప్పాల్సింది నాలుగు లడ్లు పొట్లాం కట్టి ఇవ్వమని'అనుకుంది.

అందరూ విలువైన బహుమతులే తెచ్చారు. వెండి, బంగారు వస్తువులు కూడా వచ్చాయి. బంధువులంతా వెళ్లాక సాయంత్రానికి సద్దుమణిగింది. కోడళ్లూ, కూతురూ అన్నీ ఎక్కడివి అక్కడ సర్దుతున్నారు.

బడలికగా వున్న జానకి మంచం మీద వాలుతూ అమాంతం గుర్తొచ్చి...అమ్మాయ్ శ్యామలా...నా భరిణ ఇందాక స్టూల్ మీద పెట్టాను చూసారా?' అని అడిగింది.

కోడళ్లు తెల్లముఖాలు వేసారు. అత్తగారు అంత గట్టిగా అడగడం వాళ్లకి ఇంతకు ముందు అలవాటులేదు. అందులో ఏవుందో మరి!

'రజని తీసిందేమో 'అన్నారు వస్తున్న ఆడబిడ్డని చూసి.

'ఏవిటమ్మా?'అంది రజని.

జానకి గాజు భరిణ గురించి అడిగింది

'నాన్నగారు తీసారు. దాచి వుంటారు...అందులో ఏం పెట్టావు? అడిగింది కూతురు.

ఎందులోనూ వుట్టనది! ప్రేమా....ఆప్యాయతా!'మనసులో అనుకుంది జానకి. ఇన్నేళ్ల దాంపత్యంలో భర్తమీద మొదటిసారిగా విపరీతమైన గౌరవం కలిగింది. నా వస్తువుని ఎంత జాగ్రత్తగా తీసిదాచారూ!అనుకుంటూ గదిలోకి వెళ్లింది.

రామారావు కాలిమీద కాలు వేసుకుని పడుకున్నాడు

'ఏమండీ...ఇందాక చూపించానే గాజు భరిణ... కృష్ణవేణి ఇచ్చింది..మీరు తీసారుటగా!'అంది.

'ఆ...ప్రభావతి ఉంగరం పెట్టి తీసుకెళ్తాను అన్నయ్యా! అంటే ఇచ్చేసాను...ఏం? అన్నాడు.

అయ్యో..ఎంత పని చేసారండీ?'అంది జానకి.

ఇప్పుడేవయిందనీ..... ఆ ముష్టి డబ్బా గురించి ఇంత ఇదీ!'చిరాకు పడ్డాడు.

'ముష్టి డబ్బానా? 'జానకి కళ్లల్లో నిప్పులు కురిపిస్తూ చూసింది. ఆపైన మాట రాలేదు. గుండెల్లో నెప్పొచ్చింది. గుండె మీద చెయ్యి వేసుకుని రాసుకుంటూ' ఇన్నేళ్ల కాపురంలో ఏది అడిగి చెయ్యకపోయినా క్షమించాను...కానీ నాది నాకు చెందినది...నాకు ప్రియమైనదీ....నా ప్రియనేస్తం ఇచ్చినదీ ముష్టిది అంటారా? నాకు చెప్పకుండా ఎవరికో ఇచ్చేస్తారా? అంది కన్నీళ్లతో.

రామారావు కంగారుపడ్డాడు..'జానీ...మళ్లీ నెప్పొచ్చిందా? డాక్టర్‌గార్ని పిలవనా? అంటూ దగ్గరకొచ్చాడు.

'నన్ను ముట్టుకోవద్దు....ఈ సారి నేను మిమ్మల్ని క్షమించలేను! మీరు తెలుసుకోలేకపోయిందీ గాజు భరిణ విలువ కాదండీ......నా మనసుని!'అంది.

అవే ఆమె పలికిన చివరి మాటలు.